క్లుప్తంగా

'స్పందన'కు మూడు అర్జీలు



రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు అందినట్లు ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జాన్‌పీటర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈనాం భూమిని 22ఏ లిస్ట్ నుంచి తొలగించాలని కోరుతూ కొల్లూరు మండలం నుంచి ఒక అర్జీ అందగా, నివేశన స్థలం సర్వే కోసం- 1, లోక్‌అదాలత్ కేసును పునఃపరిశీలించాలని కోరుతూ ఒక అర్జీ అందిందన్నారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని ఏఓ తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు



కర్లపాలెం: మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు మధుసూదనరెడ్డి సోమవారం పిట్టలవానిపాలెంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని పార్టీ నాయకులతో కలసి ఆయన వీర బ్రహ్మేంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయటానికి ప్రతి ఒక్క కార్యకర్త సహకరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోవతోటి విజయ్, డేగల రవిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారి చదువుకు ఆపన్న హస్తం



కొల్లూరు: తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి లాస్యకు పదో తరగతి వరకు అయ్యే ఖర్చును భరించనున్నట్లు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మండలంలోని చిలుమూరు శివారు కొత్త చిలుమూరులో చిన్నారి కుటుంబాన్ని కలసిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాయకులు ఆమె నాయనమ్మకు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, సీజ్ చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఈపూరు కృష్ణా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారంతో కొల్లూరు పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈపూరు శివారు ప్రాంతంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను నిలువరించి, కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

రేపల్లె రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని గాదెవారిపాలెంలో చోటు చేసుకుంది. చోడాయపాలెం ఇన్‌చార్జ్ ఎస్ఐ వెంకట రవి వివరాల మేరకు.. తుమ్మల పంచాయతీ గాదెవారిపాలేనికి చెందిన రేపల్లె భవానికి అదే గ్రామానికి చెందిన విష్ణుతో వివాహమైందన్నారు. కుటుంబ కలహాలు చోటు చేసుకోవటంతో ఈ నెల 26న సాయంత్రం భవాని ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. కలహాల నేపథ్యంలో తాను వెళ్లిపోతున్నట్లు తనను వెతకొద్దని, చనిపోతానని, తన పిల్లలను బాగా చూసుకోవాలని ఒక లేఖరాసిదన్నారు. భవాని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రవి పేర్కొన్నారు.

4న కలెక్టరేట్ వద్ద ధర్నా

భట్టిప్రోలు: చేనేత కార్మికులకు మజూరీలు పెంచాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 4న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ సమితి నాయకులు మురుగుడు సత్యన్నారాయణ, గొట్టుముక్కల బాలాజీ, మర్రివాడ వెంకట్రావులు తెలిపారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో వీరు విలేకరులతో మాట్లాడారు. చేనేత కార్మికులకు మజూరీలు పెంచాలని మండల తహసీల్దార్ ద్వారా జిల్లా చేనేత జౌళి శాఖాధికారులకు వినతి పత్రాల ద్వారా విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఆందోళనకు దిగనున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో చేనేత నాయకులు కె. రామకోటేశ్వరరావు, బి. నాగమల్లేశ్వరరావు, డి. శ్రీనివాసరావు, కె. మోహన్‌రావు, ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి

ఘనంగా కార్తిక సోమవారం పూజలు

ఓం నమశ్శివాయ అన్న పంచాక్షరి మంత్రం శివాలయాల్లో ప్రతిధ్వనించింది. కార్తిక మాసం రెండో సోమవారం.. అందునా పౌర్ణమి రావడంతో ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు, ప్రారంభమయ్యాయి. పలు ఆలయాల్లో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.



బాపట్ల అర్బన్: కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రేపల్లెరూరల్: ఇసుకపల్లిలో దేదీప్యమానంగా చెన్నమల్లేశ్వరస్వామి

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని గంగా పార్వతి వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో పంచామృతాలతో శివునికి అభిషేకించారు. పట్టణంలోని సోమేశ్వర స్వామి ఆలయం నందిరాజు తోటలోని శివాలయం, సూర్యలంకలోని శివ క్షేత్రం ఆధ్యాత్మికశోభతో కాంతులీనాయి. మహిళలు ఆకాశదీపాలు వెలగించారు.

నిజాంపట్నం: కార్తీకమాస పుణ్య స్నానాలతో నిజాంపట్నం, దిండిలోని సముద్ర తీరంలో భక్తులతో సందడి నెలకొంది. సముద్రం ఒడ్డున దీపారాధన పూజలను నిర్వహించారు. దిండి సముద్ర తీరాన అభయాంజనేయస్వామి ఆలయంలో, శివ లింగం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఒడ్డున ఇసుక శివలింగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు దంపతులు, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల,హరనాథ బాబు దంపతులు నిజాంపట్నం సముద్రతీరాన పుణ్యస్నానాలు ఆచరించి సముద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపల్లె రూరల్: ఇసుకపల్లిలో చెన్నమల్లేశ్వరస్వామి, రైలుపేటలోని స్వయంభూరామలింగేశ్వరస్వామి, ఓల్డ్‌టౌన్‌లోని ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తిక పూజలు చేశారు. మోర్తోట ముక్తేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో కార్తిక దీపాలు వెలిగించారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. చోడాయపాలెంలోని చౌడేశ్వర స్వామి, బేతపూడిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో కార్తిక పూజలు నిర్వహించారు.



నిజాంపట్నం: సముద్రతీరాన అన్న సంతర్పణ చేస్తున్న ఎంపీ మోపిదేవి



నిజాంపట్నం: తీరంలో సైకత శివలింగానికి పూజలు చేస్తున్న మహిళలు



రేపల్లె రూరల్: మోర్తోట ముక్తేశ్వరస్వామి

కొల్లూరు : చిలుమూరు ఉభయరామలింగేశ్వర క్షేత్రంలో భక్తులు కార్తిక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతభోగేశ్వరాలయం, కోటిపల్లి సోమశేఖరాలయంతోపాటు, పెసర్లంక, చింతర్లంక, క్రాప, అనంతవరం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి బందోబస్తు నిర్వహించారు.

30న వితలేశ్వరుడికి లక్ష బిల్వార్చన

భట్టిప్రోలు: దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన గంగాపార్వతీ సమేత వితలేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం స్వామి వార్లకు లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు కార్తిక వన సమారాధన ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఆదిన వెంకట సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు విచ్చేయనున్నట్లు తెలిపారు.

భట్టిప్రోలు: పెదపులివర్రు వరదరాజస్వామి ఆలయం, బాలత్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో అఖండ దీపారాధన, జ్వాలా తోరణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సామూహిక హారతులు, దీపోత్సవాలు నిర్వహించారు. వెల్లటూరులోని చెన్నకేశవ స్వామి, గ్రామ దేవత కట్టమ్మ తల్లి, గొడపాలెంలోని రామాలయం, కన్నెగంటివారిపాలెంలోని రామాలయంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.



భట్టిప్రోలు: వెల్లటూరు గీతాజ్ఞాన మందిరంలో వెన్నెల్లో పాలు కాస్తున్న భక్తులు



రేపల్లె రూరల్: మోర్తోట వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు



చిలుమూరు ఆలయంలో దీపారాధనలు



చిలుమూరు ఆలయంలో దైవదర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వైఎస్సార్ సీపీని బలోపేతం చేద్దాం

పిట్టలవానిపాలెం: వైఎస్సార్ సీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కలసి కట్టుగా కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ నాయకుడు, న్యాయవాది కల్లం హరనాథరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి సోమవారం అల్లూరు గ్రామంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఐకమత్యంగా ఉంచి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా వారిని చైతన్యవంతులను చేసేందుకు బాపట్ల నియోజకవర్గంలో దిద్దుబాటు యాత్రను ప్రారంభించినట్లు హరనాథరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. అన్ని గ్రామాలకు వెళ్లి వారిలో ఉన్న నిరాశ, నిస్పృహలను తొలగించి, పార్టీ విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. దిద్దుబాటు యాత్రను కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అక్కల వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీర రాఘవరెడ్డి, ఏడుకొండలరెడ్డి, పులుగు చిన్నపరెడ్డి, నంగు శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న కల్లం హరనాథరెడ్డి

కనుల పండువగా కార్తిక కోటి దీపోత్సవం

తెనాలి టౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూజ్యశ్రీ బాలస్వామిజీ పర్యవేక్షణలో చంద్రమౌళేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, భక్తులతో పూజలు చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పూజ్య శ్రీ వెంకటేశ్వర యోగి గురూజీ కార్తిక పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. పెద్దసంఖ్యలో మహిళలు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో మంద్రు శ్రీనివాస్‌కుమార్ గురూజీ, ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, లోకనాథం, రాజేశ్వరరావు, టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు కృష్ణ, గుంటూరు జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, అరుణకుమారి, అనూష, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు, శ్రీ విద్యాపీఠం లలితా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వెంకటేశ్వర యోగి గురూజీ

అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత

తెనాలి: ప్రముఖ కమ్యూనిస్టు నేత, అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ 103వ వర్ధంతి సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో జానపద కళలపై సదస్సు నిర్వహించారు. సాహితీవేత్త బి.లలితానంద ప్రసాద్ అధ్యక్షత వహించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ఉపాధ్యక్షుడు గోలి సీతారామయ్య బొల్లిముంత శివరామకృష్ణ జీవిత విశేషాలను తెలియజేశారు. కమ్యూనిస్టుగా, సినిమా సంభాషణలు, పాటల రచయితగా, పాత్రికేయుడిగా నిబద్ధతను చాటుకున్న తీరును వివరించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, కనపర్తి బెన్‌హర్, ఏఐటీయూసీ నేత పరుచూరి వెంకటేశ్వరరావు, పాతూరి సుబ్రహ్మణ్యం కవి మాట్లాడారు. డప్పు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. ప్రజానాట్య మండలి నాయకుడు పి.రామారావు ప్రజా ఉద్యమ జానపద గీతాలను ఆలపించారు. బొల్లిముంత కృష్ణ స్వాగతం పలికారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నీలాంబరం పర్యవేక్షించారు. తొలుత బొల్లిముంత శివరామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు.



బొల్లిముంత చిత్రపటానికి నివాళి

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

నిందితుల్లో ఒకరు మైనర్

తెనాలి రూరల్: చెడు వ్యసనాలకు బానిసై బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న యువకుడు సహా మైనర్ బాలుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల వివరాల్ని సీఐ ఎస్. వెంకట్రావు తెలియజేశారు. బైక్‌ల వరుస చోరీలకు పాల్పడుతున్న నందులపేటకు చెందిన సయ్యద్ అయాజ్‌తో పాటు ఇదే ప్రాంతానికి చెందిన మరో మైనర్ బాలుడ్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. నందులపేటకు చెందిన సయ్యద్ అయాజ్ ఐటీఐ వరకూ చదివి గుంటూరు ఆటో నగర్‌లోని ఓ యాక్సరీస్ షాపులో పని చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు మోటార్ సైకిళ్లను చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీనికి బైక్ మెకానిక్‌గా పని చేస్తున్న 15 ఏళ్ల మైనర్ సహకారం తీసుకున్నాడు. ఇద్దరూ కలసి ఇళ్ల ముందు తాళం వేసి ఉన్న బైక్‌లను మారు తాళాలతో చోరీ చేస్తున్నారు. ఈ విధంగా నందులపేట, నరేంద్రదేవ్ కాలనీల్లో రెండు పల్సర్ బైక్‌లు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం మోటార్ సైకిళ్లతో వెళుతున్న ఇద్దరిని వీఎస్సార్ కళాశాల వద్ద గుర్తించిన టూ టౌన్ ఎస్ఐ టి. రమేష్ బాబు అదుపులోకి తీసుకున్నారు. రెండు పల్సర్ మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సహా సిబ్బందిని సీఐ వెంకట్రావు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు, ఎస్ఐ రమేష్‌బాబు

యూనిడో సహకారంతో 'స్వచ్ఛ గుంటూరు'కు కృషి

నెహ్రూనగర్: నగరంలో కాలుష్యరహితంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంటు ఆర్గనైజేషన్ (యూనిడో) సహకరిస్తోందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఛాంబర్‌లో సోమవారం యూనిడో ప్రతినిధులు కమిషనర్‌ని కలిశారు. యూనిడో సహకారంతో నగరంలో చేపడుతున్న పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యరహిత నగరంగా గుంటూరు నగరాన్ని మార్చుకోవడంలో యూనిడో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫండ్ (జీఈఎఫ్) ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పనులు చివరి దశకు వచ్చాయని, త్వరలో గ్రిడ్ అనుసంధానం కూడా చేస్తామని వెల్లడించారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు కేటాయించిన ఈ-ఆటోల పనితీరును కూడా యూనిడో పరిశీలిస్తోందని చెప్పారు. రానున్న కాలంలో గుంటూరు నగరం యూనిడో సహకారంలో స్వచ్ఛంగా, కాలుష్యరహిత నగరంగా మారుతుందనే ఆశాభావాన్ని కమిషనర్ వ్యక్తం చేశారు. అనంతరం యూనిడో బృందం సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్‌ని, క్షేత్రస్థాయిలో ఈ-ఆటోల పనితీరుని, చార్జింగ్ పాయింట్స్, నాయుడుపేట జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును పరిశీలించారు. కార్యక్రమంలో వాషింగ్టన్ డీసీ సీనియర్ ఎవల్యూషన్ ఆఫీసర్ నీరజ్ కుమార్ నేగి, పీపీపీ స్పెషలిస్ట్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ బర్గర్, యూనిడో ప్రాజెక్ట్ డాక్టర్ నందపాల్ సింగ్, పి.వి.రమణారావు, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



యూనిడో ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, అర్జీలు రీఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఫిర్యాదు పరిష్కారం కాకుండానే కొన్ని విభాగాల అధికారులు క్లోజ్ చేస్తున్నారని, ప్రజలు తిరిగి మరలా రీ ఓపెన్ చేస్తున్నారని తెలిపారు. సదరు అర్జీలను విభాగాదిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు.

నామమాత్రపు ఫీజుతో పోటీ పరీక్షలకు శిక్షణ

పెదకాకాని: పేద నిరుద్యోగులకు నామమాత్రపు ఫీజులతో పోటీ పరీక్షలకు శిక్షణను అందిస్తున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆవరణలో గ్రూప్-2 పోటీ పరీక్షలకు రూపొందించిన పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అకాడమీ ఫౌండర్, చైర్మన్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెలక్ష్మణరావు మాట్లాడుతూ పోటీ పరీక్షలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. ఏటా ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.1.75కోట్లతో స్కాలర్‌షిప్‌లు అందజేయటం ప్రశంసనీయమన్నారు. ఈసందర్భంగా గ్రూప్-2 పోటీ పరీక్షలకు రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగంలో సోమవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. నంబూరు వివా స్కూలు విద్యార్థులు తిలకించారు. జువాలజీ ఉపయోగాలు, ప్రాముఖ్యత గురించి అధ్యాపకులు వివరించారు. సైన్స్ కోర్సులపై అవగాహన కల్పించడానికి వర్సిటీ కూడా ప్రదర్శన శాలను ఏర్పాటు చేయనున్నట్లు జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాధిపతి, ఓఎస్డీ ఆచార్య కె. సునీత తెలిపారు. సైన్స్ కోర్సుల ప్రాముఖ్యతను జువాలజీ విద్యార్థులు వి. షణ్ముఖ కల్యాణ్, శివ కోటయ్య, రాజకుమార్ వివరించారు. ఆచార్య జి సింహాచలం, వీరయ్య పాల్గొన్నారు.

బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభించిన ఎంపీ



నగరం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేవిధంగా అత్యాధునిక సౌకర్యాలతో ఇండియన్ బ్యాంక్ భవనాన్ని రూపొందించడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని చినమట్లపూడిలో ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ నూతన భవనాన్ని ఎంపీ మోపిదేవి సోమవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందించేందుకు ఇండియన్ బ్యాంక్ ముందుకు రావడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జెడ్పీటీసీ మాన్యం నాగమణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కోటేశ్వరావు, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 17, 19 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్

రేపల్లె: పట్టణంలోని 17, 19వార్డుల సచివాలయంలో ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కారుమూరు గ్రామ సచివాలయంలోనూ నిర్వహించనున్నట్లు రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు తెలిపారు. కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

నేడు వెల్లటూరులో..

భట్టిప్రోలు: వెల్లటూరు సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజన్న ప్రసాదం పంపిణీ

కర్లపాలెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన అభిమాని కర్లపాలెం వైఎస్సార్ కూరగాయల మార్కెట్ వద్ద రాజన్న ప్రసాదం పంపిణీ చేయటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు తాతపూడి మనోహర్ అన్నారు. కొక్కిగడ్డ రామరాజు సోమవారం మార్కెట్ వద్ద వైఎస్సార్ ప్రసాదం పేరుతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. . ఈ కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

గుంటూరు రూరల్: కోడి పందేల స్థావరంపై దాడిచేసి, జూదరులను అరెస్ట్ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు వివరాల మేరకు.. గోరంట్ల గ్రామం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న.. సమాచారం మేరకు దాడిచేయగా నలుగురు జూదరులను, రూ.5,750 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టుకు అప్పగించున్నట్లు తెలిపారు.

టీడీపీ గ్రూపుల మధ్య ఘర్షణ



పాత గుంటూరు: తూర్పు నియోజకవర్గం టీడీపీలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్, ముజీబ్ గ్రూపుల మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. తాజాగా సోమవారం నియోజకవర్గంలోని 51 డివిజన్ డొంక రోడ్డు ప్రాంతంలో ఇరువర్గాల నాయకుల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. తూర్పు నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ వర్గం, ఎంపీ గల్లా జయదేవ్ వర్గానికి చెందిన సయ్యద్ ముజీబ్ అసెంబ్లీ టికెట్లను ఆశిస్తున్నారు. ఎంపీ ఆదేశాల మేరకు ముజీబ్ వర్గం 51వ డివిజన్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. డివిజన్లో రోడ్డు వెంబడి ముజీబ్ సోదరులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండగా నసీర్ వర్గానికి చెందిన డివిజన్ నాయకులు గొల్ల ప్రభాకర్, మహంకాళీ నరసింహారావు, దయా రత్నం అడ్డుకున్నారు. నసీర్ లేకుండా తమ డివిజన్లో కార్యక్రమాలు చేపట్టడానికి వీల్లేదని, ఫ్లెక్సీలు కట్టడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న అరండల్‌పేట పోలీసులు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు.